క్లుప్తంగా

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి



ఎమ్మెల్యే తిప్పేస్వామిని కలిసిన తహసీల్దార్ ముర్షావలి

మడకశిర: ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. మడకశిర నూతన తహసీల్దార్ ముర్షావలి, మడకశిర పీఎస్ ఎస్ఐ-2 ఇషాక్‌బాషా ఎమ్మెల్యే తిప్పేస్వామిని ఆయన నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయవద్దన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునే విధంగా అధికారులు పని చేయాలని కోరారు.

ఘనంగా మాంతేశ్వరి జయంతి



ప్రసంగిస్తున్న పుష్పక్క

అమరాపురం: స్థానిక బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో ఆదివారం మాంతేశ్వరి జగదాంబ జయంతి ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. నిర్వాహకురాలు పుష్పక్క మాట్లాడుతూ మాంతేశ్వరి జీవితం మహోన్నతమైనదన్నారు. ఆమె భగవంతుని స్వరూపమని పేర్కొన్నారు. ఆమె ఇచ్చిన సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ నిత్యం ధ్యానం చేయాలన్నారు. ధ్యానంతో మనశ్శాంతి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


జగనన్న సురక్షపై సర్వే



రెడ్డిపల్లిలో జగనన్న సురక్షపై సర్వే చేపడుతున్న ఎంపీడీఓ, తహసీల్దార్

రొద్దం: మండల పరిధిలోని దొడగట్ట, రెడ్డిపల్లి పంచాయతీల్లో జగనన్న సురక్షపై సర్వే నిర్వహించినట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నట్లు వివరించారు. అర్హతలు ఉండి ఏదైనా పథకం అందలేదా? ఎందుకు రాలేదు? ఎక్కడ సమస్య ఉంది అన్న దానిపై ఆరాతీసి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే జగనన్న సురక్ష సర్వే కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది డుమ్మా కొట్టడంపై ఎంపీడీఓ అసంతృప్తి వ్యక్తం చేశారు. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతచారి తదితరులు పాల్గొన్నారు.

సేవకులకు దుస్తుల వితరణ



దుస్తులను అందజేసిన దృశ్యం

పరిగి: మండలంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సభ్యులకు ప్రముఖ వ్యాపారవేత్త గిరిష్ సౌజన్యంతో దుస్తులను వితరణ చేశారు. ఆదివారం మండలంలోని కొడిగెనహళ్లి జెడ్పీ స్కూల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో భగత్‌సింగ్ సేవా సమితి సభ్యులకు దుస్తులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రామలింగప్ప, నారాయణస్వామి, పురప్రముఖులు శ్రీనివాసరెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

29న మహా రథోత్సవం

హిందూపురం: తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని ముదిరెడ్డిపల్లిలోని రుక్మిణి పాండురంగ స్వామి మహా రథోత్సవాన్ని ఈనెల 29న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, కౌన్సిలర్ మద్దన జయరాములు, అధ్యక్షులు పల్లా లక్ష్మీకుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. 27న గోపూజ, గంగపూజ తదితర కార్యక్రమాలు, 28న రుక్మిణి పాండురంగ స్వామి కల్యాణం, 29న మహా రథోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అగ్నికి ఆహుతైన వక్క మొక్కలు

పావగడ: తాలూకాలోని ద్యావయ్యన పాళ్య గ్రామం నాగణ్ణ అనే రైతుకు చెందిన 50 వేల వక్క మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. బాధిత రైతు నాగణ్ణ వివరాలమేరకు.. దుండగులు నిప్పటించడంతోనే వక్క మొక్కలు దగ్ధమయ్యాయని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేసినట్లు పేర్కొన్నారు. సుమారు రూ.2 లక్షల నష్టం వచ్చిందన్నారు.

ఆదాయం ఘనం.. అభివృద్ధి శూన్యం

- 'పురం' రైల్వేస్టేషన్‌లో సమస్యల తిష్ట
- పట్టించుకోని సౌత్ వెస్ట్రన్ రైల్వే ఉన్నతాధికారులు
- డివిజన్ వేరు కావడమే సమస్యంటున్న ప్రయాణికులు



హిందూపురం రైల్వేస్టేషన్



పట్టాలపై నడిచి ప్లాట్‌ఫాంపైకి చేరుకుంటున్న ప్రయాణికులు

హిందూపురం అర్బన్: హిందూపురం రైల్వేస్టేషన్‌లో సమస్యలు తిష్టవేశాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హిందూపురం రైల్వేస్టేషన్ సౌత్ వెస్ట్రన్ బెంగళూరు డివిజన్ పరిధిలో ఉండటంతో అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

జనరేటర్ లేక ఇబ్బందులు

రైల్వేస్టేషన్‌లో రాత్రివేళ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. జనరేటర్ చెడిపోవడంతో అంధకారంలోనే మగ్గాల్సిన పరిస్థితి. రైల్వేస్టేషన్‌కు అందిస్తామన్న 25 హెచ్‌పీ జనరేటర్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

కలగానే ఎక్సలేటర్ ఏర్పాటు

ప్రధానంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ రెండో ప్లాట్‌ఫాం మీదుగా వెళ్తుంటాయి. ఆ ప్లాట్‌ఫాంకు చేరుకోవాలంటే ఫుట్ ఓవర్ బ్రిడ్జి (మెట్ల మార్గం) ద్వారానే వెళ్లాల్సి ఉంది. అయితే వృద్ధులు, పిల్లలు అక్కడికి చేరుకోవాలంటే నానా అవస్థలు పడుతున్నారు. ఎక్సలేటర్ ఏర్పాటు చేస్తామని రైల్వే ఉన్నతాధికారులు వచ్చిన ప్రతిసారి చెబుతున్నా ఇంత వరకు కార్యరూపం మాత్రం దాల్చలేదు.

రూ.3 లక్షల దాకా ఆదాయం

హిందూపురం రైల్వేస్టేషన్ మీదుగా ప్రతిరోజూ 50 దాకా రైళ్లు తిరుగుతుంటాయి. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు అధిక సంఖ్యలో ప్రయాణికులు వెళ్తుంటారు. ప్రతి నెలా హిందూపురం రైల్వేస్టేషన్ నుంచి ప్రతి నెలా రూ. 2 నుంచి 3 లక్షల ఆదాయం రైల్వేకు వస్తోంది. అయితే హిందూపురం రైల్వేస్టేషన్ సౌత్ వెస్ట్రన్ బెంగళూరు డివిజన్ పరిధిలో ఉండటంతో సమస్య వస్తోంది. రైల్వే ఉన్నతాధికారులు అప్పుడప్పుడు అలా వచ్చి వెళ్తున్నారే తప్ప... ఇక్కడి ఇబ్బందులను పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరుగుదొడ్లు లేక అవస్థ

హిందూపురం రైల్వేస్టేషన్ నుంచి గుంతకల్లు, బెంగళూరు వెళ్లే ప్యాసింజర్‌కు సంబంధించి కొన్నిబోగీల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు ఉన్న బోగీలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నోసార్లు ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

కిలో మీటర్ నడవాల్సిందే



హిందూపురం రైల్వేస్టేషన్‌లో కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లినప్పుడు రెండో ప్లాట్‌ఫాం చేరుకొనేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. గంట ముందే చేరుకొని రైల్వే ముఖ ద్వారం (ముందుభాగం) వద్ద నుంచి కిలో మీటరు నడవాల్సి వస్తోంది. ఎస్కలేటర్ ఏర్పాటు చేస్తే అందరికీ మేలు జరుగుతుంది.

– వినయ్, నానెప్పనగర్, హిందూపురం

జనరేటర్ ఏర్పాటు చేయాలి



రైల్వేస్టేషన్‌లో ప్రధాన నగరాలకు వెళ్లే రైళ్లన్నీ రెండో ప్లాట్‌ఫాం మీదుగా వస్తున్నాయి. అందరి సౌకర్యార్థం ఎస్కలేటర్ ఏర్పాటు చేయాలి. రాత్రిపూట కరెంటు పోతే జనరేటర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం జనరేటర్ ఏర్పాటు చేయాలి. – సతీష్, డీబీ కాలనీ, హిందూపురం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



హిందూపురం రైల్వేలో సమస్యలు నెలకొన్న మాట వాస్తవమే. ఇప్పటికే రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పరిష్కరిస్తామని వారు కూడా హామీ ఇచ్చారు.

– ఆదర్శకుమార్, రైల్వే బోర్డు మెంబర్

వైఎస్సార్‌సీపీతోనే మైనార్టీల అభివృద్ధి



ఎమ్మెల్యే తిప్పేస్వామిని కలిసిన మడకశిర పట్టణ మైనార్టీలు

మడకశిర: వైఎస్సార్‌సీపీతోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. ఆదివారం రాత్రి పట్టణానికి చెందిన పలువురు మైనార్టీ యువకులు ఎమ్మెల్యే తిప్పేస్వామిని కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ మైనార్టీల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మైనార్టీల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మైనార్టీలకు ఎలాంటి న్యాయం జరగలేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మైనార్టీలకు పెద్దపీట వేస్తోందన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను మైనార్టీల కోసం అమలు చేస్తోందని గుర్తు చేశారు. మైనార్టీలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా ఉండాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌కు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి

హిందూపురం: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. ఆదివారం పుంగనూర్‌లో మంత్రి నివాసంలో ఆమెతో పాటు హిందూపురం వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రిని కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు కేటాయించాలని విన్నవించారు. పురం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. వైస్ ఎంపీపీ రామాంజి, సర్పంచ్ దేవరాజు, సింగిల్‌విండో డైరెక్టర్ రంగనాథ్, నాగరాజు, సుధాకర్, నారాయణరెడ్డి, ఓబుళరెడ్డి, తిమ్మారెడ్డి, అనిల్,రాజు తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న సభ్యులు

హిందూపురం: ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని జాగృతం చేసి సమస్యలకు శాస్త్రీయ పరిష్కారం చూపి అభివృద్ధి పథంలో నడిపించే కృషి చేయడమే జేవీవీ లక్ష్యమని జేవీవీ జిల్లా అధ్యక్షుడు రామమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక చైతన్య నగర్‌లోని పీపుల్స్ క్లినిక్ వద్ద జనవిజ్ఞానవేదిక సభ్యత్వ పోస్టర్లు విడుదల కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రామమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్సుపై ఆసక్తిని పెంపొందించి చెక్‌ముకి లాటెంట్ టెస్టుతో పాటు ప్రతి నెల వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులుగా చేయడానికి కృషిచేస్తున్నామని చెప్పారు. యువత జేవీవీలో చేరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు రామకృష్ణ, ఉగ్రప్ప, లక్ష్మీపతి, రవీంద్రారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సెబ్ ఆధ్వర్యంలో నేడు ర్యాలీ

పెనుకొండ: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ర్యాలీ నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. జిల్లా సెబ్ సూపరింటెండెంట్, పెనుకొండ డీఎస్పీ నేతృత్వంలో ఉదయం 10 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

లేపాక్షిలో అన్నదానం

లేపాక్షి: లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయం సమీపంలో ఉన్న అన్నదాన సత్రంలో వైస్ ఎంపీపీ అంజినరెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ఆదినారాయణ, అన్నదాన కమిటీ సభ్యులు రామాంజినేయులు పాల్గొన్నారు.

అలా..ఇలా..ఎలా ఆడియో ఫంక్షన్



ఆడియో లాంచింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇక్బాల్, చిత్ర యూనిట్

హిందూపురం: పట్టణానికి చెందిన కొల్లకుంట నాగరాజు నిర్మించిన అలా..ఇలా..ఎలా సినిమా ఆడియో, ట్రైలర్ లాంచింగ్ కార్యక్రమం వేడుకగా జరిగింది. పట్టణంలోని ఆర్‌కే ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమానికి అతిథిగా ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ హాజరయ్యారు. ఈ చిత్రంలో హీరో, హీరోయిన్‌గా శక్తి, నిషాకొఠారీలు నటించగా, ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ సంగీతం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, వడ్డెర్లసంఘం చైర్మన్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కమ్మయ్యగారిపల్లి బస్టాండ్ వద్ద ఎండిపోయిన వృక్షం

చిలమత్తూరు: మండలంలోని కోడూరు – గోరంట్ల ప్రధాన రహదారి శెట్టిపల్లి పంచాయతీ పరిధిలోని కమ్మయ్యగారిపల్లి బస్టాండ్ వద్ద వేప వృక్షం ఎండిపోయింది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారి కావడంతో ప్రజలు బస్సులు, ఆటోల కోసం అక్కడే వేచి చూస్తుంటారు. వర్షాకాలం కావడంతో గాలీ వాన ఎక్కువ అయితే ఎండిపోయిన వృక్షం కూలిపోయే ప్రమాదం ఉంది. వాహనదారుల మీద పడినా, గ్రామస్తుల మీద పడినా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. పలుమార్లు ఈ చెట్టును తొలగించాలని అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఎండిపోయిన వృక్షాన్ని తొలగించాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



లింగమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పరిగి: మండలంలోని ధనాపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ రాము తల్లి లింగమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆదివారం ధనాపురానికి వెళ్లారు. మృతురాలు లింగమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, మాజీ కన్వీనర్ జయరాం, సర్పంచ్ ప్రభాకర్ ఉన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుర్గప్ప భార్య లక్ష్మమ్మ (65) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకరనారాయణ గ్రామానికి చేరుకొని లక్ష్మమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట జెడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీటీసీ నిర్మల, నాయకులు నారాయణస్వామి, మహేంద్ర, తదితరులున్నారు.

గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడు



భగవద్గీత పుస్తకాలతో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు ప్రచారం చేశారు. ఆదివారం పట్టణంలోని టీచర్స్ కాలనీ, ప్రశాంతినగర్ ప్రాంతాల్లో భగవద్గీత పుస్తకాలతో ప్రచారం చేపట్టారు. ఇంటింటా వెళ్లి భగద్గీత పుస్తకాలు, క్యాలెండర్లు అందజేశారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి అధ్యక్షులు ఆదినారాయణ, మునీంద్రా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు-కన్నడ కవితా గోష్టిలో 'పురం' వాసి



యువకవి చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: శ్రీశ్రీ కళావేదిక కర్ణాటక శాఖ ఆధ్వర్యంలో మైసూరులో తెలుగు-కన్నడ కవితా గోష్టి జరిగింది. హిందూపురం పట్టణానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు, యువకవి చంద్రశేఖర్ ఆ కార్యక్రమంలో పాల్గొని స్వీయ కవితాగానం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ అభినందించారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించి పురస్కారం అందజేశారు.

వృద్ధురాలి కడుపులో 5 కేజీల కణతి

- విజయవంతంగా తొలగించిన వైద్యులు



మహిళకు శస్త్ర చికిత్స నిర్వహిస్తున్న వైద్యులు

పావగడ: కడుపు నొప్పితో బాధ పడుతున్న ముద్దమ్మ (65) అనే మహిళ కడుపులోని 5 కేజీల కణతి తొలగించి వైద్యులు ఆమె ప్రాణాలు కాపాడారు. వైద్యుల తెలిపిన వివరాల మేరకు.. తాలూకాలోని బాలమ్మనహళ్లి గ్రామానికి చెందిన ముద్దమ్మ కొన్ని రోజులుగా తీవ్ర కడుపు నొప్పితో బాధ పడుతున్నారు. కొన్ని రోజుల క్రితం పట్టణంలోని డా శివకుమార్ ఆస్పత్రిలో ప్రముఖ గైనకాలజిస్ట్ డా శివకుమార్ ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి కడుపులో కణతి ఉన్నట్లు గుర్తించారు. అయితే ఆమె వయసు 65 కావడంతో శస్త్ర చికిత్స కష్టమని భావించి తుమకూరుకు చెందిన గైనకాలజిస్ట్ డా చంద్రశేఖర్ బృందం ఆధ్వర్యంలో ఆదివారం ఆమెకు శస్త్ర చికిత్స చేసి 5 కేజీల బరువైన కణతి తొలగించారు. శస్త్ర చికిత్స విజయ వంతంగా నిర్వహించి ఆమె ప్రాణాలు కాపాడిన వైద్యులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మురుగు నీరు ప్రవహించకుండా చర్యలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లసముద్రం ఎస్సీ కాలనీలో దెబ్బతిన్న తాగునీటి పైపులైన్ మరమ్మతులు చేసి రోడ్డుపై మురికి నీరు పారకుండా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరారు. మురికి నీరు పారుతుండడంతో నడిచి వెళ్లడానికి కూడా ఇబ్బందిగా ఉందన్నారు. అధికారులు చర్యలు తీసుకొని వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. సోమవారం పరిశీలించి మురికి నీరు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు తీసుకొంటామని గ్రామ కార్యదర్శి మారుతీప్రసాద్ తెలిపారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

రొద్దం: మండల పరిధిలోని ఎల్‌జీబీనగర్‌లో స్థలం విషయంలో రెండు వర్గాల మధ్య రగడ జరడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. ఈడిగ అంజి, కురుబ నాగభూషణ ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వివాదాస్పదమైన స్థలం ఆర్‌అండ్‌బీ చెందినది కాగా రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని ఓ వర్గానికి చెందిన వారికి పట్టా మంజూరు చేసినట్లు తెలిసింది. తురకలాపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న స్థలానికి బొక్సంపల్లి వీఆర్‌ఓ పట్టా మంజూరు చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారుల తప్పిదాల వలన ఈ స్థలంపై గొడవ జరిగినట్లు సమాచారం.



ఉష్ణోగ్రత సమాచారం

(గరిష్టం)

హిందూపురం	32.0
పెనుకొండ	34.0
మడకశిర	32.0

తుస్సుమన్న బస్సు యాత్ర

పరిగి: మండల కేంద్రంలో టీడీపీ తలపెట్టిన బస్సు యాత్ర తుస్సుమంది. ఆదివారం సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం జరగాల్సి ఉంది. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు అష్టకష్టాలు పడి జనసమీకరణ చేశారు. అయితే రాత్రి 10.45 గంటల సమయంలో టీడీపీ నాయకులు బీకే పార్థసారథి, మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు తదితరులు పరిగికి వచ్చారు. అప్పటికే దాదాపుగా అందరూ వెళ్లిపోవడంతో కార్యక్రమాన్ని మమ అనిపించారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

అమరాపురం: మండలంలోని కె.శివరం గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు.

నేడు డివిజన్‌స్థాయి స్పందన

హిందూపురం: హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పెనుకొండ డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు, మండలశాఖ అధికారులు హాజరవుతారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కమ్యూనిస్టు నేత కన్నుమూత



రామాంజినప్ప (ఫైల్)

పావగడ: సీనియర్ సీపీఐ నేత జీహెచ్ రామాంజినప్ప (70) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. తాలూకాలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన రామాంజినప్ప ఎన్నో భూ పోరాటాలు చేసి ఎంతో మంది పేదలకు భూ పంపిణీ జరిగేలా చేశారు. అలాగే పుట్టణ్ణయ్య రైతు సంఘంలో చేరి రైతుల సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేశారు. ఆయన మృతికి స్థానిక సీపీఐ కార్యదర్శి రామకృష్ణ, ఈర దాసప్ప, కర్ణాటక రాజ్య రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప, కిసాన్ రైతు సంఘం అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, తాలూకా రైతు సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి సంతాపం తెలిపారు.

పోలీసుల అదుపులో దొంగలు?

పావగడ: స్థానిక తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలోని సోలార్ ప్రాజెక్టుకు చెందిన కేబుల్ వైర్ల దొంగలు తిరుమణి పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ఇటీవల బ్లాక్ 1 ఆద్య సోలార్ కంపెనీలో వైర్ల చోరీకి పాల్పడుతున్న ఓ దొంగను కంపెనీకి చెందిన సెక్యూరిటీ గార్డులు పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. ఇందులో భాగంగా తిరుమణి పోలీసులు ఆంధ్రకు చెందిన పేరూరు, రెడ్డివారిపల్లి, తగరకుంట గ్రామాల నుంచి కొంత మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

ర్యాలీ విజయవంతం చేయండి

మడకశిర: మడకశిరలో సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు స్థానిక సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ర్యాలీలో విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

హిందూపురం: పట్టణంలోని వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మారుతీరెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని వృద్ధాశ్రమంలో కేక్‌కత్తిరించి వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అభిజిత్‌రెడ్డి, ప్రణయ్‌రెడ్డి, అరన్నాథ్, ఇంద్రశేఖర్, శ్రీనాథ్, నంజుడ, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.